ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## సప్తదశాధ్యాయము

అనంతరమూ వైశ్యశ్రేష్ఠులు గురువగు భాస్కరాచార్యునకు నమస్కరించి, మా వైశ్య వివాహమునకు సంబంధించిన యాచారలక్షణములను దెలుపుడని కోరిరి.

అంత భాస్కరాచార్యుడు సంతోషించినవాడై శిష్యులైన బాలవైశ్యులను జూచి "ఓ బాలకుమార! మీ పూర్వులచే వివాహక్రతువు ఎట్లాచరించపబడినదో దానిని సర్వము నిపుడు తెలియజేయుచున్నాను.

పూర్వము బ్రహ్మాఋషులచే వేదోక్త విధిననుసరించి చెప్పబడినట్లు పంచాహ్నికముగ వివాహక్రతువు నాచరించవలెను. అటుపై వైశ్యవర్ణమువారు ఆచరింపవలసిన కొన్ని విశిష్టాచారములను సావధానులై వినుడు" అని యిట్లు చెప్పసాగెను.

### భాస్కరాచార్యుడు వైశ్యుల వివాహ విధానమును వివరించుట :-

శిష్యవరులారా! కైలాసవాసులైయుండిన మీ పూర్వవైశ్యులు స్వకుల కన్యక యొక్క వివాహ విధానమును గురించి ఆలోచించియుండిరి. ఆ వివాహవిధిని అనుసరించియే వైశ్యవర్ణములో వివాహములు చేయదగినవి. ఇంద్రుని, అగ్నిని, వరుణుని, కుబేరుని, చంద్రుని స్తంభరూపములుగ ప్రతిష్ఠించి ఆప్రోలి స్తంభములతో మంటపమేర్పరచి ఆ మంటప వేదికపై తూర్పు ముఖముగ యీ శుభకార్యము చేయదగినది. వేదోక్తరీతిని

సూత్రకారులు చెప్పిన విధానమును అనుసరించి వైశ్యులుకూడ ఐదుదినములు వివాహ క్రతువును ఆచరించవలెను. ఇపుడు వైశ్యులకు వివాహకార్యములతోపాటు ఆచరించవలసిన విశేష కార్యక్రమమును విశదముగ వినుడు.

ప్రథమములో మొదటి దినమున గంగాపూజ గావించవలెను : అనంతరము సాయంప్రాతఃకాలములలో వైశ్యులు ఔపాసనను (అగ్నికార్యమును) చేయవలెను. రెండవ దినమున సకల పాపపరిహారమునకై సమస్త దేవతలను యధాశక్తి భక్తితో పూజించవలెను. అటుపై వధూవరుల భోగభాగ్యాభివృద్ధికై గ్రామపు వెలుపలకు మంగళతూర్యములతో వెళ్ళి రెండు కలశములలో ముప్పదిరెండు పసుపు ముద్దలను వుంచి కలశములను వేరువేరుగ పూజించవలెను. మూడవ దినమున వైశ్యోత్తములచే గోత్రపూజ చేయదగినది. నాల్గవదినమున వధూవరులు రాత్రియొక్క తొలిజామున కామధేనువు పూజ గావించవలెను. వైశ్యుల ప్రధాన వృత్తులలో గోపరిపాలన మొకటి, గోమఠముల నెలకొల్పి గోపోషకులై గోమఠులు (కోమటులు) అను పేరుపొందిన వైశ్యులకు కామధేనువు తల్లియై విలసిల్లుచున్నది. కైలాసము నుండి భూలోకమునకు మహా ప్రస్థానము గావించిన మీ పూర్వులు గోగర్భప్రదేశములో కొంతకాలము వసించి గోకర్ణక్షేత్రముద్వార భువికి అవతరించిరి. వారు సర్వదేవతా స్వరూపిణియైన కామధేనువుకు ఘృత, క్షీర, శర్కర, నారికేళ ఫలములతోను ఏలకులతోను కూడిన వరిపిండిని నైవేద్యమిడి దానిని ప్రసాదముగ స్వీకరించి శక్తివంతులైరి కనుక వివాహసమయములో వధూవరులు కామధేనువుకు ఆ విధముగనే నైవేద్యమిడి పూజించవలెను. నాల్గవరోజు రాత్రి శేషహోమమును, సమాప్తము చేయవలెను. వైశ్యులు ఓడలలో విదేశ వ్యాపారము చేయుట యందు సుప్రసిద్ధులు. అందువలన ఓడ వైశ్యులకు పూజనీయమైనది. కనుక వివాహ సందర్భములో ఐదవ దినమున వైశ్యులు నౌకాసమర్చనము గావించవలెను. ఆరవదినమున పంచప్రోలి స్తంభములతో విరాజిల్లు

కళ్యాణ వేదికా మధ్యమున పరాశక్తి స్వరూపిణియైన వాసవీకన్యకాపరమేశ్వరీ దేవీ కలశమును స్థాపించి ఏడవ దినమున నందీశ్వరార్చనము గావించవలెను. తదనంతరము గురునాజ్ఞతో కంకణ విసర్జనము చేసి వస్త్రభూషణమును, ధనధాన్యములను కులగురువుకు సమర్పించి సంతోషపరచి అటుపై వధువుతో గూడ వరుడు గృహప్రవేశము చేయవలెను. ఇట్లు విశేషకార్యక్రమములతో గూడి వైశ్యులకు వివాహము ఏడుదినముల క్రతువైనది. వివాహ క్రతుదినములైన యీ ఏడు దినములలో ఏకభుక్తులై సాయంసమయముల యందు పసుపు కుంకుమలతో పరిమళించు సాలంకృత కలశములోనికి పరాశక్తి స్వరూపిణియైన కన్యకాదేవిని ఆవాహనముచేసి దేవీవ్రతపూజన మాచరించవలెను. ఇది ప్రాచీన కాలములో మీ పూర్వవైశ్యులు ఆచరించిన వివాహ క్రతువిధానము. పరిస్థితుల అనుకూల్యముననుసరించి ఈ వివాహక్రతువు, పైన చెప్పిన అంశముల క్రమమును విడువకుండ ఏడుదినములలో గాని తప్పని పరిస్థితులలో మూడు దినములలో గాని తుదకు ఒక్కదినములోనైనను ఆచరింపనగును." అని ఆచార్యుడు చెప్పిన అనంతరము ఆ సభలో విరూపాక్షుడు భాస్కరాచార్యునితో "గురుదేవా! మా తండ్రి బంధుసమూహములను పిలిపించి వారిని ప్రేరేపించి మిక్కిలి భయంకరమైన అగ్నిలో వారితోగూడి ప్రవేశించెను. తల్లిదండ్రుల వియోగముతో నేను దుఃఖించుచున్నట్లే అందరును తమ తమ తల్లిదండ్రులను పోగొట్టుకొని దరిలేని దుఃఖసముద్రలో మునిగియున్నారు. వారికి దుఃఖోప శమనము గావించుటకొరకు నేనేమి చేయతగునో దయచేసి తెలియజేయుడు." అని ప్రార్థించెను.

అంత భాస్కరాచార్యుడు శిష్యుని జూచి "ఓ మహారాజా! పరంధామమును పొందిన పితరులను గూర్చి నీవు దుఃఖించదగదు. అగ్నిలో ప్రవేశించిన మీ బంధువుల యొక్క బిడ్డలను పిలిపించి వారినోదార్చి, వారి కోర్కెలను తీర్చి, వారి దుఃఖమునుపశమింపజేయుము" అని బోధించెను. ఆ నాటికి సభ చాలించబడినది.

## వైశ్యసమారాధన వర్ణనము

మరునాటి ఉదయమున విరూపాక్ష శ్రేష్ఠి, తన తండ్రితోపాటున అగ్నిప్రవేశము చేసిన బంధుజనుల బిడ్డలనందరిని నగరేశ్వరాలయమునకు పిలిపించి, వారి తల్లిదండ్రులు చేసిన మహాత్యాగమును మిక్కిలిగ ప్రశంసించి పలువిధముల స్వాంతన వచనములు పలికి, వారినందరిని సకుటుంబ సపరివారముగ తన ఇంటికి భోజనమునకు రమ్మని ఆహ్వానించెను. విరూపాక్షుని ఆహ్వానము మేరకు మరుసటిరోజున బంధుమిత్ర జనులందరును రథ, గజ హయాది వాహనముల నధిరోహించి వైశ్యరాజైన విరూపాక్షుని భవనమునకు విచ్చేసిరి. నాలుగువేల మూరల విస్తీర్ణము కలిగి, మణిఖచితములైన సోపానములు గలదియు, స్ఫటిక స్తంభములతో శోభిల్లు నదియు, నవరత్నములతో కూర్చబడిన మేల్కట్ల కాంతులచే ప్రకాశించునదియు, మృదులములైన రత్నకంబళ్ళు పరచబడిన నేలతో నొప్పారునదియు, సుగంధ ధూపములతో పరిమళించునదియు, నవనిధులతో నిండి కుబేరుని గృహముతో సమానమైనదియునైన విరూపాక్షుని ప్రాసాదములో నూరుపంక్తులు దీరి, భోజనమునకై కూర్చుండిన వైశ్యబృందము నూరువేల సంఖ్యగలదై వెలుగొందినది. పంచభక్ష్య పరమాన్నములతోడను, పలురకముల పిండి వంటలతోడను గూడిన దివ్యభోజనమును వేయిమంది వడ్డించుచుండగ విరూపాక్షశ్రేష్ఠి పంక్తుల మధ్య దిరుగుచు, కూర్చుండిన వారికి ఉపచారములను చేయసాగెను. అంత ఆ వైశ్యులందరును లెస్సగ విందారగించి, "నాడు సైన్య సమేతుడగు భరతునకు భరద్వాజ మహర్షి గావించిన ఆతిథ్యమువలే నేడీవిందు భోజనమున్నది" అని సంతుష్టచిత్తులై వేనోళ్ళ విరూపాక్షుని పొగడసాగిరి.

అటుపై విరూపాక్షరాజు తన తండ్రితోపాటు ఆత్మార్పణ గావించిన వారి కుటుంబములకు కోటికోటి స్వర్ణముద్రలను, అనేక రత్నములను వస్త్రవాహనా భరణాదులను బహూకరించి వారిని సంతోషపరచెను.

## వాసవీ నవరాత్రి మహోత్సవములు

అటుపై చైత్రశుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రాత్రులు ఆ వైశ్యోత్తములందరును గలిసి, జరిపిన ఉత్సవములలో అన్ని వర్ణములవారగు పట్టణ ప్రజలు పగటిని రాత్రిని తెలుసుకొనలేకపోయిరి. వాసవీదేవి ప్రభావము చేత గోవులు కుండలతో పాలీయసాగినవి. వృక్షములు కల్పవృక్షసమానము లైనవి. నదులు తేనెవంటి మధురజలవాహినులైనవి. బావులు అమృతపు కొలంకులైనవి. వైశ్యులా ఉత్సవములలో బ్రాహ్మణులకును, ఋషులకును, పేదలకును బహుప్రకారములైన భూరిదానములొసగిరి. ప్రతిదినము భోజనము చేయుచుండిన నూరువేల బంధుమిత్రపరివార జనుల సంఖ్యను జూచి విరూపాక్షుడుత్సాహముతో ఉప్పొంగిపోయెను.

అనంతరము ప్రజలందరును పలువిధ వాహనములతో రకరకముల మంగళవాయిద్యములతో నటగాయకవైతాళికులతోకూడి, అత్యంత వైభవోపేతముగ నగర ప్రదక్షిణము గావించి, గౌరీనగరేశ్వరులను, కోనకమలాజనార్ధనులను, వింధ్యవాసినీదేవిని సకలోపచారములతో అర్చించి వాసవీదేవి యొక్క అర్చావతారమూర్తి సన్నిధికి చేరుకొనిరి.

## శ్రీవాసవీ దేవీ సహస్ర నామస్తోత్ర మహత్వము

అర్చావతారయై వెలసిన శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీదేవి సన్నిధికి చేరిన వారినెల్లరిని గురువరేణ్యుడైన భాస్కరాచార్యుడు ఆ దేవియొక్క విశేషపూజకు సంసిద్ధులను జేయుచు యిట్లు చెప్పసాగెను.

“ఓ భక్తవరులారా! శ్రీ వాసవీకన్యకాదేవీ సహస్రనామ స్తోత్రము సర్వపాప వినాశకరమైనది. పూర్వము యీ దేవీ సహస్ర నామస్తోత్రము ఆదిశేష భగవానునిచే

ధర్మనందునకు చెప్పబడినది మరియు మీ పూర్వుడగు సమాధియను మహాత్ముడు ఈ సహస్ర నామ స్తోత్రముతో ఆదికన్యకా పరమేశ్వరిని అర్చించి అమోఘ వరమును బడసి ధన్యుడయ్యెను. ఈ స్తోత్రము నరులకు ఆయురారోగ్యములు ప్రసాదించును. ధనధాన్యాభివృద్ధి గావించును. దివ్యజ్ఞానమును కలుగజేయును. పుత్రపౌత్రాభివృద్ధిని సమకూర్చును. ఈ సహస్ర నామమునకు బ్రహ్మయే ఋషిగా చెప్పబడును. ఇది అనుష్టుప్ఛందస్సులో నున్నది. ఈ సహస్రనామములు శ్రీ వాసవీకన్యకాదేవీ లక్షణయుక్తములై విరాజిల్లుచున్నది.

అనేక సహస్ర నామములలో ఇవి సర్వసిద్ధిప్రదములు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆగమర్చనము నందివి మిక్కిలి ముఖ్యమైనవి. ఈ సహస్ర నామములతో పఠించుటచే శ్రీ వాసవీదేవి ప్రీతిపొందునట్లు యితర నామములను పఠించుటవలన ప్రీతినోందదు. శ్రీవాసవీకన్యకదేవికి ప్రియము గూర్చుటకై సదావాసవీ సహస్రనామములనే పఠించవలెను. శ్రీవాసవీకన్యా చక్రరాజమందు దేవిని నిలిపి కుంకుమతోగాని, పుష్పములతోగాని, తులసి దళములతోగాని యీ సహస్రనామములను పఠించుచు పూజించువానికి పెనుగొండ పురవరాధీశ్వరియైన శ్రీ వాసవీకన్యక సమస్త శుభములను సమకూర్చును. అనంతశక్తివంతమగు శ్రీ వాసవీ మంత్రరాజమును సాంగముగ జరిపించినపుడు కలుగు ఫలము యీ సహస్రనామ పఠనమువలన కలుగగలదు. కనుక యీ దివ్యసహస్ర నామ స్తోత్రము చేతనే శ్రీవాసవీ కన్యకాదేవిని అర్చించవలెను." అని తెలిపి భాస్కరాచార్యుడు శ్రీవాసవీసహస్ర నామావళితో దేవిని కీర్తించనారంభించెను. ఆ సహస్రనామావళిననుసరించి విరూపాక్షాది వైశ్యులు శ్రీ వాసవీదేవీ అర్చావతారమూర్తిని కుంకుమతో పూజించి కీర్తనలతో స్తుతించిరి.

ఆ దివ్యసహస్రనామ స్తోత్రములతోను, భక్తిపూర్ణములైన స్తుతి కీర్తనలతోను సంప్రీతురాలైన వాసవీకన్యకాదేవి కోటిసూర్యప్రభాభాసమానయై వారికి ప్రత్యక్షమైనది. ఆ జగన్మాత దివ్యదర్శనము వలన అందరును పరమానందభరితులైరి.

ఆ దేవదేవేశ్వరిని గాంచి భక్తితో తన్మయులై "అవ్యక్త పరబ్రహ్మ రూపిణివైన, ఓ ఆదిశక్తీ! మంగళస్వరూపమైన ఓ దేవీ! దుష్టదానవులను నాశనము జేయు ఓ భద్రకాళికా! భక్తులకు ఇష్టార్థములనిచ్చు ఓ నారాయణీ! సర్వలోకములను భ్రాంతి బొందించు ఓ మహామాయా! వాసుదేవుని సహోదరివైన ఓ శ్రీ కన్యకా! దుర్గతిహారిణివైన ఓ దుర్గాదేవీ! నిజభక్తులకు సదాజయమును చేకూర్చు ఓ విజయా! "రసోవైసః" యని చెప్పబడిన రసస్వరూప పరమాత్మయను మకరందమును గర్భమున యిముడ్చుకొని యున్న ఓ కుముదా దేవీ! సర్వాకర్షణ శక్తి స్వరూపవై సృష్టికి మూలమైన తమః ప్రతీక నీలవర్ణవైన ఓ కృష్ణా! సర్వవ్యాపకమైన విష్ణుశక్తి స్వరూపవగు ఓ వైష్ణవీదేవీ! శుంభనిశుంభాది రక్కసులను దునుమాడిన ఓ చండికా! ఈశ్వర శక్తివైన ఓ ఈశానీ! సమస్తము నందు వసించుచు సమస్తమును నీయందు వసింపజేసుకొని యున్న ఓ వాసవీదేవీ! బ్రహ్మశక్తివైన ఓ శారదాదేవీ! భండాసురాంశాసంభూతుడైన విష్ణువర్ధనుని అంతమొందింపజేసిన ఓ జ్యేష్ఠశైలపురీశ్వరీ! ఓ మహాలక్ష్మీ స్వరూపిణీ! ఓ మహాసరస్వతీ స్వరూపిణీ! ఓ మహాకాళీ స్వరూపిణీ! సృష్టిస్థితిలయకారిణివైన ఆదిపరాశక్తి! ఓ శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ దేవీ! నీకు కోటికోటి ప్రణామములు" అని బహుభంగులకీర్తించి ఆ జగదీశ్వరి చరణ కమలములకు సాష్టాంగ దండ ప్రణామములాచరించిరి.

వారి భక్తి ప్రపత్తులు గాంచి ప్రసన్నురాలైన శ్రీ వాసవీదేవి "నాయనలారా! మీ భక్తికి మెచ్చితిని. మీరుగావించిన నా దివ్యసహస్రనామావళీ స్తోత్రముతో సంతుష్టురాలనైనాను. మీకు కావలసినది కోరుకొనుడు. మీ అభీష్ట ఫలములనోసగెదను" అని పలికి అనుగ్రహము చూపినది.